ఈనాడు ఖమ్మం

బుధవారం అక్టోబరు 2, 2024 7

ప్రకృతి అందగా.. పూల పండగ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే



విజయ దశమి(దసరా) అంటే తెలంగాణలో గుర్తొచ్చేవి బతుకమ్మ సంబురాలు. ప్రకృతిలో చెట్టు, చేమ, రాయిరప్పా.. పువ్వూ మొగ్గా.. ఇలా అన్నింటినీ పూజించడం హైందవ సంప్రదాయం. తెలంగాణ ఖ్యాతి, సంస్కృతి, సంప్రదాయంలో పూలను పూజించే, ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ వేడుకలకు విశిష్ట స్థానం ఉంది. ఏటా అశ్వయుజ మాసం శుద్ధ పాడ్యమికి ముందు వచ్చే అమావాస్య రోజు బతుకమ్మ వేడుకలు ప్రారంభమై దుర్గాష్టమి రోజు ముగుస్తాయి. ఈఏడాది అక్టోబర్ 2 నుంచి తొమ్మిది రోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో బతుకమ్మ సంబురాలను మహిళలు, యువతులు వైభవంగా నిర్వహించనున్నారు. గౌరమ్మకు పూజలు చేసి తమ కోరికలు ఫలించాలని వేడుకుంటారు. తీరొక్క పూలను సేకరించి అందంగా పేర్చి పండగ విశిష్టత తెలిసేలా రోజూ అందమైన బతుకమ్మలను తయారుచేస్తారు. సాయంత్రం పూట ఒక్కచోటుకు చేరుకొని బతుకమ్మలను దగ్గరగా అమర్చి వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడిగా గడుపుతారు.

"బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..", "ఒక్కేసి.. పువ్వేసి చందమామ..", "చిత్తూ చిత్తూల బొమ్మా.. శివునీ ముద్దుల గుమ్మా.." అంటూ సాగే పాటల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు వెల్లివిరుస్తాయి. వేడుకల అనంతరం బొడ్డెమ్మతో పాటు బతుకమ్మలను మహిళలు, యువతులు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ

మహాలయ అమావాస్య రోజు ఈ వేడుకలు జరుగుతాయి. ముందురోజే పూలను కోసి వాడిపోకుండా నీళ్లలో వేసి మర్నాడు బతుకమ్మగా పేరుస్తారు. దీన్నే ఎంగిలి పూల బతుకమ్మగా కొలుస్తూ తమలపాకులు, తులసి ఆకులను వాయనంగా ఇస్తారు. నువ్వులు, బియ్యం, పిండి నూకలు కలిపి నైవేద్యం తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

రెండో రోజు అటుకుల బతుకమ్మ

అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తారు. తంగేడు, గునుగు, బంతి, గడ్డి పూలను సేకరించి గౌరమ్మను పేర్చి సాయంత్రం పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ నిమజ్జనం చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తారు. ప్రసాదంగా అటుకులను పంపిణీ చేస్తారు.



మూడో రోజు ముద్దపప్పు

సీతమ్మ జడ, చామంతి, రామబాణం వంటి పూలతో బతుకమ్మను పేర్చి ముద్దపప్పు బతుకమ్మగా పూజిస్తారు. ముద్దపప్పు, పాలు, సత్తుపిండి, చెక్కర, పెసలు, బెల్లంతో నైవేద్యం తయారుచేసి సమర్పిస్తారు.

నాలుగో రోజు నానబియ్యం..

గుమ్మడి, మందార పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడతారు. నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

ఐదో రోజు అట్ల బతుకమ్మ

అట్లు లేదా దోశలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఆరో రోజు అలిగిన..

అశ్వయుజ పంచమి రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి బతుకమ్మ ఆటలు ఆడరు. నైవేద్యం సమర్పించరు.

ఏడో రోజు వేపకాయల..

బియ్యపు పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదో రోజు వెన్నముద్దల..

దేవేరికి వెన్నతో నువ్వుండలను చేస్తారు. నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యంగా అమ్మవారికి సమర్పిస్తారు.

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ




దుర్గాష్టమి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకొంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారుచేస్తారు. పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. చివరి రోజు "పోయిరా బతుకమ్మ.. వెళ్లిరావమ్మ.. మళ్లొచ్చే యాడాది తిరిగి రావమ్మా.." అని వీడ్కోలు పలుకుతారు.

మహాత్ముడి అడుగుజాడలే అభివృద్ధికి సోపానాలు

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

ప్రపంచ వ్యాప్తంగా 'బాపు' అని పిలవబడే మహాత్మాగాంధీ ఆచరించిన సత్యం, అహింస మార్గాలు ఎందరో నాయకులను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాయి. సత్యం, అహింస, ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల ప్రధాన ఆయుధాలుగా మాతృదేశ బానిస సంకెళ్లను తెంచిన గాంధీజీ జాతిపితగా, మహాత్ముడిగా ఎందరికో ఆదర్శప్రాయుడయ్యారు. ఆయన ముందుచూపు, ఆలోచనలు, వ్యక్తిత్వం కోట్లాది మందికి చుక్కానిగా నిలిచాయి. గ్రామ స్వరాజ్యం, మద్యపాన నిషేధం, సామాజిక జీవనం ఇలాంటివెన్నో ఆచరించిన గొప్ప వ్యక్తి గాంధీజీ. ఈ రోజు మహాత్ముడి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



"హింసకు ప్రత్యామ్నాయాన్ని ఆవిష్కరించారు గాంధీజీ. మార్పు, న్యాయాన్ని హింసతో కాకుండా నైతిక బలంతో సాధించవచ్చునని నిరూపించారు. అందుకే గాంధీజీని అపురూప విశ్వమానవుడిగా కొనియాడతాను."
- స్టీవ్ జాబ్స్, ఆపిల్ సంస్థ వ్యవస్థాపకుడు

స్వయం కృషితో పల్లెల్లో వెలుగులు

విద్య, వైద్యం, ఆరోగ్యం, ఆదాయసృష్టి, స్వచ్ఛత మొదలైన రంగాల్లో పురోగతి సాధించేందుకు ఉభయ జిల్లాల్లోని కొన్ని గ్రామ పంచాయతీలు కృషిచేస్తున్నాయి. ఆయా ఆదర్శ గ్రామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురస్కారాలను అందజేయటం విశేషం. చుంచుపల్లి మండలం గౌతంపూర్, పాల్వంచ మండలం తోగ్గూడెం, కొణిజర్ల పంచాయతీలు గతేడాది ప్రజారోగ్యం, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, ఇంకుడుగుంతల నిర్మాణం వంటి విభాగాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిల్లో సత్తాచాటాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం పంచాయతీలు చెత్త నుంచి సంపదను సృష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కొన్ని నెలలుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవటంతో పాలన గాడితప్పుతోంది.

ఆదర్శం ఆ గ్రామాలు..


దుర్వ్యసనాలు అభివృద్ధికి అవరోధాలుగా మారుతున్నాయి. దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన యువత.. మద్యం, ఇతర మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకుంటోంది. పట్టణాలు, గ్రామాలనే తేడాలు లేకుండా మద్యం ఏరులై పారుతోంది. అయితే భద్రాద్రి జిల్లాలోని కరకగూడెం మండలం చిరుమల్ల, పట్టుపాటి గుంపు, ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెం గ్రామ పంచాయతీల్లో కొన్నేళ్లుగా మద్యపాన నిషేధం అమలవుతుండటం గమనార్హం.

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు


గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా 15 రోజులుగా ఉభయ జిల్లాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిని మహాత్ముడి జయంతితో ముగించనున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ నిషేధం అమలుకు పూనుకుంటున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఇంకుడుగుంతల నిర్మాణాలకు వీలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా అమలయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీలకు పురస్కారాలు అందజేయనున్నారు.

వివిధ అంశాలపై సర్వే నిర్వహించగా 100 మంది తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..


గాంధేయవాదంపై అవగాహన ఉందా?




మహాత్ముడి ఆలోచనలు ప్రస్తుత సమాజంలో కార్యరూపం దాల్చుతున్నాయా..?



మద్యపాన నిషేధంలో ఎవరి పాత్ర ఉంది?



పల్లెలే పట్టుగొమ్మలన్న గాంధీ నినాద స్ఫూర్తి గ్రామాల్లో కనిపిస్తోందా..?



అడిగిన వారందరికీ ఉపాధిహామీ పనులు: శ్రీజ

ఖమ్మం నగరం: అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలు సహా సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. లేబర్ బడ్జెట్‌పై దృష్టి సారించాలని, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలన్నారు. ఇందిరా డెయిరీ ఏర్పాటు చర్యలు వేగవంతం చేయాలన్నారు. నర్సరీలకు సంబంధించి ఆయా ప్రదేశాల్లో డిమాండ్ కలిగిన మొక్కలు పెంచాలన్నారు. డీఆర్డీఓ సన్యాసయ్య, జడ్పీ ఉప సీఈఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

3 నుంచి సార్వత్రిక వార్షిక పరీక్షలు

ఖమ్మం విద్యావిభాగం: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 9 వరకు పదో తరగతి, ఇంటర్ థియరీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త మద్దినేని పాపారావు మంగళవారం తెలిపారు. పదో తరగతికి ఖమ్మంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్‌కు రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల బీమాకు న్యాయ సహాయం

ఖమ్మం న్యాయవిభాగం: వరదల కారణంగా నష్టపోయిన వాహనాల బీమా విషయంలో న్యాయసహాయం అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాసంస్థ ఛైర్మన్ జి.రాజగోపాల్ అన్నారు. ఇటీవల జిల్లాలో సంభవించిన భారీ వర్షాల వల్ల వాహనాలకు జరిగిన నష్టానికి సరైన బీమా ఉన్నా నష్టపరిహారం లభించని కేసులను ప్రీ-లిటిగేషన్ విధానంలో న్యాయ సేవాసంస్థ పరిష్కరిస్తుందన్నారు. ఇలాంటి కేసుల్లో బాధితులు జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యాలయంలో ఫిర్యాదు దాఖలు చేయవచ్చని సూచించారు. వరద నీటిలో వాహనాలు మునిగిపోయిన సందర్భంలో వాటి యజమానులు నిబంధనలు తెలియక తొందరపాటులో దగ్గర్లో ఉన్న మెకానిక్ షాపుల్లో మరమ్మతులు చేయించి అనంతరం నష్ట పరిహారం కోసం బీమా కంపెనీని ఆశ్రయిస్తారన్నారు. అలాంటి కేసుల్లో బీమా కంపెనీలు సాంకేతిక కారణాలు చూపిస్తూ క్లెయిమ్‌లను తిరస్కరించినప్పుడు న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, కార్లు, మినీ ట్రాన్స్‌పోర్టు లారీల యజమానులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో ప్రవేశాలు

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తొలి విడత కౌన్సెలింగ్ పూర్తైంది. స్థానిక కోటా కింద ఖమ్మం కళాశాలలో 65 మంది సీట్లు సాధించారు. అందులో 16 మంది తొలిరోజు అడ్మిషన్లు తీసుకున్నారు. రెండో విడత కౌన్సెలింగ్ వరకు మిగిలిన వారు చేరడానికి సమయం ఉంది. అలాగే జాతీయ కోటాకు సంబంధించి 15 మందికి గాను 12 మంది అడ్మిషన్లు తీసుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు.

పెరుగుతున్న శ్రమదోపిడీ: యూసుఫ్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో శ్రమదోపిడీ పెరిగిపోయిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తెలిపారు. ఖమ్మంలో ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణల పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పని చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రావి శివరామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, బీజీ క్లెమెంట్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

నిరాశతో వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు

ఖమ్మం విద్యావిభాగం: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ మంగళవారం మొదలుకాలేదు. ఖమ్మం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదకొండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకే 22 మంది ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరయ్యారు. డీఈఓ సోమశేఖరశర్మ ఉదయం 10.30 గంటలకు వచ్చి గంటపాటు ఉన్నారు. అభ్యర్థులు ఆయనను కలిసి జాబితా ప్రకటించలేదని తెలిపారు. ఆయన రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపారు. హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయం నుంచి జాబితా రాగానే పరిశీలిస్తామని చెప్పారు. జిల్లాలోని ఎర్రుపాలెం, వేంసూరు, సత్తుపల్లి, మధిర, సింగరేణి, తల్లాడ, బోనకల్లు, చింతకాని తదితర మండలాల నుంచి సుమారు 100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అర్హత సాధించినవారి తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు సైతం వివరాలు ఆరా తీశారు. సాయంత్రం వరకూ రాష్ట్రస్థాయి అధికారుల నుంచి జాబితా రాలేదు.



రాష్ట్ర అధికారులతో చరవాణిలో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ, హెచ్ఎంలు, సిబ్బంది

నేటి నుంచి ప్రారంభం.. కొన్ని సాంకేతిక కారణాలతో మంగళవారం ధ్రువపత్రాల పరిశీలన జరగలేదని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. 575 మంది అభ్యర్థుల నియామకానికి సంబంధించి ఈనెల 2 నుంచి 5 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరిశీలన ఉంటుందని చెప్పారు. 2వ తేదీ ఎస్జీటీలకు, 3న స్కూల్ అసిస్టెంట్లకు, 4, 5 తేదీల్లో అందరు అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఖమ్మం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని రోటరీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు మార్చారు.

జాగ్రత్తలు తప్పనిసరి.. 1:3 నిష్పత్తిలో ఎన్నికైనవారి జాబితా రాగానే సమాచారం అన్నిగ్రూపుల్లో పెడతారు. సంబంధిత అభ్యర్థి చరవాణికి సంక్షిప్త సమాచారం/మెయిల్ వస్తుంది. జాబితాలో ఉన్నవారు మాత్రమే హాజరుకావాలి. స్వదస్తూరితో చెక్ లిస్టు, అన్ని ధ్రువపత్రాల ఒరిజినల్‌లు, రెండు సెట్ల జిరాక్స్(గెజిటెడ్ ఆఫీసర్ అటెస్టేషన్)తో ఒక పాస్‌పోర్టు ఫొటో వెంట తెచ్చుకోవాలి. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు ప్రింట్ కాపీ, హాల్ టికెట్, టెట్ ర్యాంకు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి.

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు అమలుచేయండి: మంత్రి

ఖమ్మం నగరం: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు సమర్థంగా అమలుచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 3 నుంచి 8 వరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఇంటింటి సర్వే, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ విస్తరణ, నూతన యూడీఏ ఏర్పాటు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఆశించిన ఫలితాలు రాలేదని, 3 నెలలు గడిచినా దరఖాస్తులు పరిష్కారం కాలేదని ఇందుకు కారణాలు వెల్లడించాలన్నారు. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు చేయాలని, క్వింటాకు అదనంగా బోనస్ రూ.500 రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీపీఓ ఆశాలత, ఆర్డీఓలు గణేశ్, రాజేందర్ పాల్గొన్నారు.



వృద్ధుల దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

యువతతో అనుభవాలను పంచుకోవాలి

ఖమ్మం కమాన్‌బజార్: వయోవృద్ధులు తమ అనుభవాలను యువతకు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. ఖమ్మం టీటీడీసీ భవనంలో నిర్వహించిన వృద్ధుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ విద్యాలయాల్లో ఒకరోజు పెద్దలను గౌరవిద్దాం(రెస్పెక్ట్ ఫర్ ఎల్డర్స్) పేరిట కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. డీడబ్ల్యూఓ కె రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టాలపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పిస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు వి.చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల క్రీడలు

ఖమ్మం క్రీడలు: జిల్లా స్థాయి పాఠశాల క్రీడలు ఖమ్మం పటేల్ స్టేడియంలో మంగళవారం ముగిశాయి. అండర్-14 బాలుర కబడ్డీలో ఖమ్మం సౌత్ ప్రథమ, సత్తుపల్లి ద్వితీయ, అండర్ 17 లో వైరా ప్రథమ, ఖమ్మం సౌత్ ద్వితీయ, అండర్ 14 ఖోఖో లో వైరా ప్రథమ, కూసుమంచి ద్వితీయ, అండర్ 17లో ఖమ్మం నార్త్ ప్రథమ, మధిర ద్వితీయ స్థానాలు పొందాయి. డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ, క్రీడల కార్యదర్శి నర్సింహమూర్తి విజేతలకు బహుమతులు అందజేశారు.

రెండో జోన్‌కి 3,500 క్యూసెక్కుల నీరు

ఖమ్మం గ్రామీణం: సాగర్ ఎడమ కాలువ రెండోజోన్‌కు పాలేరు జలాశయం నుంచి మరో 500 క్యూసెక్కుల నీటి విడుదలను మంగళవారం పెంచారు. జిల్లాలో సాగర్ ఆయకట్టుకు అవసరాలు పెరిగిన నేపథ్యంలో అధికారులు 3,032 క్యూసెక్కుల నుంచి 3,500లకు పెంచారు. సాగర్ జలాశయం నుంచి పాలేరుకు కేవలం 1700 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఇక్కడి నుంచి ఎడమ కాల్వ రెండో జోన్‌కు 3,032 క్యూసెక్కులు, పాలేరు కాలువకు 120 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండటంతో జలాశయం నీటిమట్టం క్రమేణా తగ్గుతోంది. రెండు రోజుల క్రితం 18.70 అడుగులున్న నీటిమట్టం మంగళవారం సాయంత్రం 17.20 అడుగులకు తగ్గింది.

డిజిటల్ కార్డుల సర్వేకు గ్రామాలు, వార్డుల ఎంపిక

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు కుటుంబాల సర్వే నిర్వహణకు పైలెట్ ప్రాజెక్టులో జిల్లాలోని ఆరు గ్రామాలు, పది మున్సిపల్ వార్డులు ఎంపిక చేశారు. వీటిలో ఈనెల 3 నుంచి 8 వరకు సర్వే నిర్వహించనున్నారు. వివరాలు ఇలా..

- రఘునాథపాలెం మండలం రాములు తండా గ్రామ పంచాయతీలో 165 కుటుంబాలు, ఖమ్మం నగరపాలక సంస్థ 54వ డివిజన్‌లో 1,200 కుటుంబాలు.
- కూసుమంచి మండలం ధర్మా తండాలో 160, ఖమ్మం గ్రామీణ మండలం గుదిమళ్ల శివారు కొత్త నారాయణపురంలో 164 కుటుంబాలు.
- చింతకాని మండలం సీతంపేటలో 160 కుటుంబాలు, మధిర మున్సిపాలిటీలో 17వ వార్డు లడకబజార్‌లో 170 కుటుంబాలు.
- ఏన్కూరు మండలం కోదండరామాపురం పంచాయతీలో 161 కుటుంబాలు, వైరా మున్సిపాలిటీ 14వ వార్డులో 190 కుటుంబాలు.
- సత్తుపల్లి మండలం వాచ్యా నాయక్ తండాలో 197 కుటుంబాలు, సత్తుపల్లి మున్సిపాలిటీ 22వ వార్డులో 230 కుటుంబాలు.
- ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేలో ఎంపిక చేసిన కుటుంబాల వివరాలు సేకరించనున్నారు.
- ఈ సర్వే కార్యక్రమం పర్యవేక్షించేందుకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నియమించారు.

ఆశల పంటలపై నీళ్లు.. పరిహారమందక కన్నీళ్లు!



కూసుమంచి మండలం భగత్‌వీడు వద్ద వరద ఉద్ధృతికి దెబ్బతిన్న వరి పైరు (పాత చిత్రం)

ఈటీవీ, ఖమ్మం: భారీ వర్షాలు, వరదల ధాటికి అన్నదాతలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. పంట నష్టపరిహారం అందటంలో జాప్యమవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు రూ.10వేల చొప్పున అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇప్పటికే జిల్లాల వారీగా పంట నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి అందినా పరిహారం సొమ్ము.. ఖాతాల్లో జమకాకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మళ్లీ పంటల సాగుకు కాసింత అవకాశమున్నా.. పెట్టుబడులకు చేతిలో చిల్లిగవ్వ లేక సర్కారు సాయం వైపు దీనంగా ఎదురుచూస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో..

ఈ ఏడాది ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1న భారీ వర్షాలు, వరదల ధాటికి 33 శాతం కన్నా ఎక్కువ పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహించింది. ఖమ్మం జిల్లాలో 27,219 మంది రైతులు 27,908 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,148 మంది 2,656 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, ఎర్రుపాలెం, కూసుమంచి, మధిర, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, చింతకాని, బోనకల్లు మండలాల్లో సుమారు 21వేల మంది రైతులు 24,500 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు తేల్చారు. పంట నష్టం నివేదికను వారం క్రితం ప్రభుత్వానికి అందజేశారు.

నెల దాటినా..

వరి సాగుకు ఎకరాకు రూ.30వేలు, పత్తికి రూ.40వేలు, మిర్చికి రూ.50వేలను రైతులు వెచ్చించారు. ఇప్పుడు మళ్లీ సాగు చేద్దామంటే పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక విలవిల్లాడుతున్నారు. సెప్టెంబర్ 2న ఖమ్మం జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి బాధిత రైతులకు రూ.10 వేల చొప్పున పరిహారమందిస్తామని ప్రకటించారు. సర్వే పూర్తయిన వెంటనే పరిహారం సొమ్ము రైతుల ఖాతాల్లో జమవుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. పంటలు నష్టపోయి నెల దాటుతున్నా ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పండగల కాలమైనా అన్నదాతల ఇళ్లల్లో సందడి కనిపించడం లేదు.

భారీ వర్షాలు, వరదల ధాటికి నష్టపోయిన కర్షకుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమవుతుంది. అన్నదాతలు ఆందోళనకు గురికావొద్దు.
- పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

మూడెకరాల్లో వరి సాగుచేశాను. రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టాను. ఆకేరు వరద ఉద్ధృతికి పంటంతా కొట్టుకుపోయింది. మళ్లీ పంట సాగు చేద్దామంటే చేతిలో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వ సాయం కొంత ఆసరాగా ఉంటుందనుకున్నా.. నెల దాటుతున్నా ఇంకా అందలేదు.
- బానోత్ సురేష్, కస్నాతండా, ఖమ్మం గ్రామీణం మండలం



పాలేరు ఏటి పక్కన ఆరెకరాల్లో వరి సాగుచేశాను. పంట మొత్తం ఇసుక మేటలు వేయటంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. ఇసుక మేటలు తీయాలంటే అదనంగా ఖర్చవుతుంది. ప్రభుత్వ సాయం సత్వరమందితేనే కొంతైనా మాకు కష్టాలు తప్పుతాయి.
- బదావత్ రవి, హాటియాతండా, కూసుమంచి మండలం



దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

దసరా, బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో 724 ప్రత్యేక బస్సులను నడపనుంది.



ఈ మేరకు రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో విస్తృత ఏర్పాట్లు చేసింది. గత అనుభవాల రీత్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ప్రణాళికలు రూపొందించింది. ఈనెల 1 నుంచి 11 వరకు, 13 నుంచి 17 వరకు ఎగువ, దిగువ మార్గాల్లో ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అలాగే 9వ తేదీ నుంచి 11 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ ప్రాంతాలకు.. 13, 14 తేదీల్లో హైదరాబాద్‌కు నిత్యం తిరిగే సర్వీసులకు అదనంగా 100 బస్సులు నడపాలని సన్నాహాలు చేస్తోంది. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలిగిన బస్సుల్లో టికెట్ల బుకింగ్ పూర్తైతే ప్రయాణికుల డిమాండ్ మేరకు మరికొన్ని బస్సుల్లో రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించనుంది.

డిపోల వారీగా అదనపు బస్సుల వివరాలు ఇలా..

డిపో	ఎగువ	దిగువ	మొత్తం
ఖమ్మం	130	72	202
మధిర	71	37	108
సత్తుపల్లి	93	47	140
భద్రాచలం	91	49	140
కొత్తగూడెం	41	20	61
మణుగూరు	33	15	48
ఇల్లెందు	17	08	25

ఇతర సమాచారం కోసం ఈ కింద నంబర్లను సంప్రదించాలి

ఖమ్మం నూతన బస్టాండ్	9959225979
ఖమ్మం పాత బస్టాండ్	9959225965
సత్తుపల్లి	9959225990
మణుగూరు	8985361796
కొత్తగూడెం	9959225982
మధిర	7382925289
భద్రాచలం	9959225987


హైదరాబాద్ మార్గంలో 24 గంటల పాటు: సరిరాం, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్

ఖమ్మం నుంచి హైదరాబాద్ మార్గంలో 24 గంటల పాటు నాన్‌స్టాప్ బస్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం. అన్ని మార్గాల్లో ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తూ బస్సుల సంఖ్యను పెంచడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రత్యేక బస్సులు నడిపే సమయంలో విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఆర్టీసీ నుంచే భోజన వసతి కల్పిస్తున్నాం.

శ్రమకు విజయం దాసోహం

ఉపాధ్యాయులు కావాలని కలలుగన్నారు. లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివారు. అనుకున్నది సాధించి మిగతా వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. సోమవారం విడుదల చేసిన డీఎస్సీ జాబితాలో ప్రతిభ చూపిన యువత పరిచయమే ఈ కథనం..

లక్ష్యానికి ఏదీ అడ్డుకాదు



జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యం ఉంటే ఏదీ అడ్డుకాదని నిరూపించారు సాతానిగూడెం పంచాయతీ రాజీవ్‌నగర్ తండా నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన ధరావత్ రాంబాబు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. తండ్రి, ఇద్దరు సోదరుల సంరక్షణలో పెరిగారు. బీకాం, బీఈడీతో పాటు ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. లాక్‌డౌన్ సమయంలో వివాహం చేసుకున్నారు. రెండేళ్లపాటు వ్యవసాయం చేశారు. రెండేళ్ల క్రితం భార్య, బిడ్డను ఇంటి వద్ద ఉంచి హైదరాబాద్‌లో ఆరు నెలల పాటు శిక్షణ పొందారు. అక్కడే వసతి గృహంలో ఉంటూ ఉద్యోగ పరీక్షలు రాశారు. సాంఘికశాస్త్రం విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లా స్థాయిలో 23వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.

– కామేపల్లి, న్యూస్‌టుడే

మూడు కొలువుల శ్రావణి



సత్తుపల్లికి చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, పద్మావతి దంపతుల కుమార్తె శ్రావణి ఏకంగా మూడు కొలువులు సాధించారు. ఇంటర్ చేస్తున్నప్పుడు తండ్రి మృతి చెందారు. భర్త శ్రీధర్‌బాబు ప్రోత్సాహంతో బీఎస్సీ బీఈడీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల స్పెషల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించిన శ్రావణి డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు కైవశం చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించారు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా యూట్యూబ్ క్లాసుల సాయంతో విజయకేతనం ఎగురవేశారు.

– సత్తుపల్లి, న్యూస్‌టుడే



★ తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి చెందిన **తెనాలి నాగేశ్వరరావు** తల్లిదండ్రుల పేర్లు వీరభద్రం-కమల. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్ర విభాగంలో పదో ర్యాంకు దక్కించుకున్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని చదివారు. కల్లూరు, ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 13 ఏళ్లు టీచర్‌గా పనిచేశారు. ఇటీవల గురుకుల టీజీటీ కొలువు సాధించి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.



★ ముద్దునూరు గ్రామానికి చెందిన **గురిజాల గౌరి** తన తల్లి సీత, భర్త రాజేశ్ ప్రోత్సాహంతో రాణించారు. ఎస్జీటీలో 22వ ర్యాంకు దక్కించుకున్న ఆమె ప్రైవేట్ టీచర్‌గా, వాలంటీర్‌గా పని చేశారు. పెళ్లయ్యాక గృహిణిగా ఉంటూనే సమయం వృథా కాకుండా చదువుకొని కొలువు దక్కించుకున్నారు.

– తల్లాడ, న్యూస్‌టుడే

ప్రథమ ర్యాంకర్..



ముత్తగూడెం గ్రామానికి చెందిన జి.నరసింహారావు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఎంఎస్సీ, ఎంపెడ్ పూర్తి చేసి ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఇటీవల గురుకుల పరీక్షల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ఎంపికయ్యారు. నియామక లెటర్ కోసం వేచి చూస్తున్న క్రమంలో డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రథమ ర్యాంకు వచ్చింది.

– ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే

కూలీకెళ్తూ.. రెండు కొలువులు



ఒక ఉద్యోగ సాధనే కష్టమని భావిస్తున్న తరుణంలో ఈ యువకుడు ఏకంగా రెండు కొలువులు సాధించారు. ఆత్కూరు గ్రామానికి చెందిన ఉయ్యాల ప్రసాద్ ఇటీవల సంక్షేమ వసతి గృహ అధికారిగా జోనల్ స్థాయిలో 37వ ర్యాంకు సాధించారు. డీఎస్సీ ఫలితాల్లో సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్ ఓపెన్ కేటగిరీలో 12వ ర్యాంకు లభించింది. ఇతనిది చాలా నిరుపేద కుటుంబం. తండ్రి లేరు. తల్లి కూలీపనులకు వెళ్తూ చదివించింది. తనూ ఇంటివద్ద కూలీ పనులకు వెళ్తూ ప్రభుత్వ కొలువుకు సిద్ధమయ్యారు. నెలల వ్యవధిలో రెండు విజయాలు తన ఖాతాలో వేసుకున్నారు.

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

ఒకేసారి.. రెండు ఉద్యోగాలు



★ యడవల్లికి చెందిన **బాల నరసింహారావు** తాజా డీఎస్సీలో రెండు ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)లో జిల్లా స్థాయిలో 14వ ర్యాంకు కైవశం చేసుకున్నారు. ఎస్జీటీలో 50వ ర్యాంకుతో మెరిశారు. 12ఏళ్లుగా సీఆర్పీగా పనిచేస్తున్న నరసింహారావు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కష్టపడ్డారు. డిగ్రీ చదువుతున్న సమయం నుంచి ఇంటి వద్దనే విద్యార్థులకు ట్యూషన్లు చెబుతున్నారు. 23 ఏళ్ల బోధనానుభవంతోనే ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి శిక్షణ తీసుకోలేదని తెలిపారు.



★ గంధసిరికి చెందిన **దారగాని బాబు** మూడో ప్రయత్నంలో విజయం సాధించారు. స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్ర విభాగంలో ఏడో ర్యాంకు కైవశం చేసుకున్నారు. కొంత కాలం ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. శిక్షణ తీసుకోకుండా ఇంటి వద్దనే ప్రణాళిక ప్రకారం చదువుతూ ర్యాంకు సాధించారు. బాబును కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

– ముదిగొండ, న్యూస్‌టుడే



★ పేద కుటుంబానికి చెందిన రేమిడిచర్ల గ్రామ యువకుడు **చెన్నంరాజు రామభద్రరాజు** గతంలో రెండుసార్లు ప్రయత్నించి డీఎస్సీ సాధనలో విఫలమయ్యారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఈసారి సిద్ధమయ్యారు. గతంలో తీసుకున్న శిక్షణ మెటీరియల్ సద్వినియోగం చేసుకున్నారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు.



★ రాజులదేవరపాడు గ్రామానికి చెందిన **దుద్దుకూరు కృష్ణవేణి** రైతు కుటుంబంలో జన్మించారు. ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంది. రైల్వే ఉద్యోగి అయిన భర్త మార్త వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో ఇంట్లోనే ఉంటూ డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఎస్జీటీలో జిల్లా 71వ ర్యాంకు దక్కించుకున్నారు.

– ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

జీపీఎస్ ట్రాకర్‌తో.. చర్లలో గద్ద సంచారం..!

చర్ల, న్యూస్‌టుడే: చర్లలో ఆదివారం జీపీఎస్ ట్రాకర్లతో ఉన్న ఓ గద్ద సంచరించిన అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ గద్ద సంచారం స్థానికంగా కలకలం రేపింది. స్థానిక నాయక కాలనీలోని ఏకలవ్య విద్యాలయం సమీపంలోని గుట్ట ప్రాంతంలోకి ఆదివారం వచ్చిన గద్ద ఓ చోట కూర్చుండిపోయింది. అక్కడ నుంచి ఎంతసేపటికీ అక్కడి నుంచి వెళ్లకపోవడంతో అక్కడ పనిచేస్తున్న వారు దానిని గమనించారు. ఆకలితో ఉందని గుర్తించి చికెన్ పెట్టడంతో ఎంచక్కా తింది. కొద్దిసేపటి అనంతరం ఎగిరి వెళ్లిపోయింది. దీని కాళ్లకు కెమెరాతోపాటు, జీపీఎస్ ట్రాకర్ ఉండటంతో అది ఎక్కడినుంచి వచ్చిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సీఐ రాజువర్మ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.



నాయకకాలనీ గుట్ట ప్రాంతంలో సంచరించిన గద్ద కాళ్లకు జీపీఎస్ ట్రాకర్, కెమెరా

వీడని స్నేహబంధం



ప్రసాద్



చల్లా రమేశ్

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మణుగూరులో పుట్టి పెరిగిన ఆ ముగ్గురు స్నేహితులు ఖమ్మం వచ్చి కాల్వలో గల్లంతయ్యారు. బండారు భరత్(30) మృతదేహం లభ్యమైన విషయం విదితమే. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గల్లంతైన చల్లా రమేశ్(38) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రసాద్(27)కు ఇంకా పెళ్లి కాలేదు. ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వీరంతా వయసులో భేదం ఉన్నా అన్నదమ్ముల్లా కలిసి ఉండేవారని.. ఎక్కడికైనా కలిసే వెళ్తారని బంధువులు చెబుతున్నారు. సోమవారం ఆనందంగా గడిపామని.. ఇంతలోనే ఇలా జరిగిందని వారితో పాటు వచ్చిన రొండా వెంకటేశ్వర్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బంధువుల్లో సడలని ధైర్యం..: గల్లంతైన వారిలో భరత్‌కు మాత్రమే ఈత రాదని బంధువులు తెలిపారు. మిగిలిన రమేశ్, ప్రసాద్ మంచి ఈతగాళ్లని వారి బంధువులు చెబుతున్నారు. వారిద్దరు బతికే ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.21.15 లక్షల జరిమానా వసూలు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: అక్రమ మద్యం, నాటుసారాకు సంబంధించి 412 కేసులు న్యాయస్థానం ద్వారా పరిష్కారానికి వచ్చాయి. నిందితులు చెల్లించిన జరిమానాల విలువ రూ.21.15 లక్షలు. ఖమ్మం స్టేషన్ 1లో 141, స్టేషన్ 2లో 109, వైరా 48, మధిర 30, సత్తుపల్లి 3, సింగరేణి 26, నేలకొండపల్లి 55 కేసులకు పరిష్కారం లభించింది. ఈ కేసుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నమోదైన కేసులే అధికంగా ఉన్నాయి.

మైకులో అరుపు.. కోతులు పరుగు..


కోతుల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు నానాయాతన పడుతున్నారు. ఊరికో ఆలోచన చేస్తూ కోతులు బెదిరిపోయే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఏన్కూరు మండలం అక్కినాపురంతండాలో సీతారాములు అనే రైతు పత్తి పొలంలో రోజంతా కాపలా ఉండలేక మైకు ఆలోచన చేశాడు. చిన్న మైకును పొలంలో చెట్టుకు వేలాడదీసి అందులో కుక్కల అరుపులు బిగ్గరగా వచ్చేలా ఏర్పాటు చేశాడు. ఆ అరుపులకు కుక్కలు ఉన్నట్లు భావించి వానరదండు అటువైపుగా రావడం లేదు. వినూత్నంగా ఉన్న ఆ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.



– ఏన్కూరు, న్యూస్‌టుడే

ఎట్టకేలకు గంజాయి ధ్వంసం

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన 1120.04 కిలోల గంజాయిని మంగళవారం ఉన్నతాధికారుల సమక్షంలో తల్లాడ మండలం గోపాలపేటలోని ఓ పరిశ్రమ భట్టిలో కాల్చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులుగా ఉన్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సహాయ కమిషనర్ గణేష్, జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి, సహాయ అధికారి వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో గంజాయిని ధ్వంసం చేశారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇప్పటికే కొలిక్కి వచ్చిన 72 కేసుల్లో పట్టుబడి ఉన్న 1120.04 కిలోల గంజాయిని ధ్వంసం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడు ఆబ్కారీ స్టేషన్లకు చెందిన 72 కేసుల్లో పట్టుబడిన గంజాయి 1120 కిలోలు ఉండగా ఇందులో సగానికి పైగా ఖమ్మం నగరంలో పట్టుబడిందే ఉంది. ఖమ్మం 1 స్టేషన్ పరిధిలో నమోదైన 40 కేసుల్లో 484.37 కిలోలు, స్టేషన్ 2 పరిధిలోని 15 కేసుల్లో 170.496 కిలోల గంజాయి పట్టుబడింది.



భట్టిలో గంజాయిని కాల్చేస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేష్, నాగేంద్రరెడ్డి

నగరం తర్వాత మధిర స్టేషన్ పరిధిలో నమోదైన 9 కేసులకు గాను 224 కిలోలు పట్టుబడింది. ఇప్పుడు కాల్చివేసిన సరకు ఆరునెలల కిందటి వరకు కొలిక్కి వచ్చిన కేసులకు సంబంధించింది. ఇంకా స్టేషన్లలో మరో 700 కిలోల వరకు ఉంటుందనే అంచనాలు ఉన్నాయి.

భద్రాద్రి జిల్లాలో గుట్టలుగా సరకు...

ఖమ్మం జిల్లా పరిధి స్టేషన్లలో మగ్గుతున్న గంజాయిని ధ్వంసం చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 7 వేల కిలోల గంజాయి ధ్వంసం చేయాల్సి ఉంది. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ఆబ్కారీ ఎస్‌హెచ్‌ఓ స్టేషన్లలో పట్టబడిన గంజాయి గుట్టలుగా పెరుగుతోంది. కేసులు కొలిక్కి వచ్చే వరకు సంరక్షించడం ఓ సవాలుగా మారింది. ఎట్టకేలకు ఖమ్మం జిల్లాలోని నిల్వలు కొంత వరకు ధ్వంసం చేయగా భద్రాద్రి జిల్లాలోని సరకును ఈనెల 4న చేసేందుకు శాఖ కసరత్తు చేస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

◆ ఒకరి పరిస్థితి విషమం

కారేపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారేపల్లి మండలం గుట్టకింద గుంపు గ్రామానికి చెందిన భార్యభర్తలు ఉండం సూర్యనారాయణ(50), సుగుణ(45) ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో ఆల్యాతండాకు చెందిన దారావత్ రాజు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన నక్క వెంకటేశ్(32) ఇద్దరు కారేపల్లి వైపు నుంచి ఇల్లెందు వెళ్తున్నారు. భాగ్యనగర్‌తండా పరిధిలో బొడ్రాసికుంట ఆంజనేయస్వామి ఆలయం ముందు రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. ఘటనలో ఒకరి తల మరొకరికి తగిలి తీవ్రగాయాలతో రోడ్డుపై పడ్డారు. తీవ్ర రక్తస్రావం అయి ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన రాజును ఖమ్మంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై రాజారామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సూర్యనారాయణ



సుగుణ



వెంకటేశ్

కర్మలకు వెళ్లి వస్తూ.. కానరాని లోకాలకు

మృతుల దంపతులు వారికున్న నాలుగు ఎకరాల్లో పత్తిసాగు చేస్తూ ఖాళీ సమయాల్లో సూర్యనారాయణ తాపిమేస్త్రీగా పని చేస్తున్నారు. సుగుణ సైతం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు వడ్డించిన తరువాత వారి చేను పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో వీరి బంధువుల కర్మ కార్యక్రమానికి వెళ్లి పని ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. 3 కి.మీ దాటితే ఇంటికి చేరే వీరిని విధి మృత్యువడికి చేర్చింది.

కుమారుడు చేదోడువాదోడుగా

సూర్యనారాయణ, సుగుణ దంపతులకు కుమారుడు జ్ఞానేశ్వర్, కూతురు నవ్యశ్రీ ఉన్నారు. కూతురు బీఈడీ చదువుతోంది. కుమారుడు మాత్రం ఇంటర్ వరకు చదివి తండ్రి వ్యవసాయ పనులకు, కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఉన్నట్టుండి తల్లితండ్రిని కోల్పోవడంతో అనాథలుగా మిగిలిన ఇద్దరి కన్నీటి రోదనలు మిన్నంటాయి.

కొద్దిరోజుల క్రితమే నిశ్చితార్థం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన వెంకటేశ్ కారేపల్లి మండలం ఉసిరికాయపల్లి పరిసర ప్రాంతంలో ఉన్న సింగరేణి సంస్థకు చెందిన సోలార్ ప్లాంట్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా వెంకటేశ్‌కు వారి రాష్ట్రానికి చెందిన ఓ యువతితో కొద్ది రోజుల క్రితమే నిశ్చితార్థం జరిగింది. కొద్ది నెలల్లో పెళ్లి పీటలెక్కాల్సిన యువకుడు మృతితో తోటి ఉద్యోగులంతా దిగాలు చెందారు. రాజు సైతం సోలార్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పనులు చేస్తున్నారు.

విషపురుగు కుట్టి యువకుడి మృతి



తరుణ్

ములకలపల్లి, న్యూస్‌టుడే: నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని విషపురుగు కుట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం గ్రామానికి చెందిన పూనెం తరుణ్(23) ములకలపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామంలో బంధువుల ఇంటివద్ద ఉంటూ అటవీశాఖలో ఒప్పంద ప్రాదిపదికన అన్నారం బైస్ క్యాంప్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని విషపురుగు కుట్టడంతో హుటాహుటిన పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని తల్లి పూనెం నాగేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుమందు పిచికారీ చేసి..: పురుగుల మందు పిచికారీ చేసి అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి ములకలపల్లి మండలంలో మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురానికి చెందిన బైటా రాంబాబు(25) గ్రామంలోని ఓ రైతు పొలంలో గతనెల 13న పురుగులమందు పిచికారీ చేశాడు. అదేరోజు సాయంత్రం అస్వస్థతకు గురవడంతో ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వివాహిత బలవన్మరణం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొత్తగూడేనికి చెందిన గుర్తుమూర్తి, పావని(36) దంపతులకు ఇద్దరు పిల్లలు. గురుమూర్తి పక్షవాతం, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. భర్త అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పావని తన తల్లిగారింటికి మండలంలోని పల్లెగూడెం గ్రామానికి వచ్చింది. మనస్తాపం చెందిన పావని సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 20 వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. అదనపు సమాచారం కోసం ఫోన్ నంబర్లు 040-23551235, 23550967ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి అర్చన చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య ఇక్కడ దర్శనం ఇవ్వడం భక్తులు చేసుకున్న అదృష్టమని వైదిక పెద్దలు ప్రవచించారు. సీతమ్మకు యోక్త్రాన్ని, రామయ్యకు యజ్ఞోపవీతాన్ని ధరింపజేశారు. మాంగల్యధారణ కనుల పండువగా సాగింది.

చంద్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈవో రమాదేవి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మం సారథినగర్: ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం నగరంలోని సారథినగర్ పరిసరాల్లో తనిఖీలు జరిపిన క్రమంలో 11.9 కిలోల గంజాయిని తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి మూటలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని స్టేషన్ 2లో కేసు నమోదు చేశారు. డీటీఎఫ్ తనిఖీ సి.ఐ. కరుణశ్రీ, ఎస్సై సరిత సిబ్బంది ఉన్నారు.


ఆయిల్‌పాం రైతుల ధరహాసం

◆ టన్ను రూ.14,392 నుంచి రూ.17,043కు పెంపు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

రెండేళ్ల తరువాత ఆయిల్‌పాం గెలల ధర భారీగా పెరిగింది. టన్నుకు రూ.2651 మేర పెరిగింది. దీంతో ఆయిల్‌పాం రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2022 జూన్‌లో టన్ను రూ.23 వేల పైచిలుకు వచ్చిన గెలల ధర ఆనాటి నుంచి దిగజారుతూ అదే ఏడాది అక్టోబరులో రూ.12,996కి తగ్గింది. ఆనాటి నుంచి నేటివరకూ ఆయిల్‌పాం గెలల ధర రూ.14,392కు మించలేదు.

★ 2024 ఆగస్టులో ఎట్టకేలకు టన్ను గెలల ధర రూ.14,392కు పెరిగి రైతులకు ఊరటనివ్వగా సెప్టెంబరు నెలకు ఏకంగా టన్ను గెలల ధర రూ.17043కి చేరింది. దీంతో దసరా బోనాంజాను రైతులు ముందే అందుకున్నట్లుగా భావిస్తున్నారు.



★ రెండేళ్లుగా గిట్టుబాటు ధర కావాలంటూ రైతు సంఘాల వినతిపత్రాలు, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. గత మూడేళ్లుగా ముడిపామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలని రైతులు డిమాండు చేస్తునే ఉన్నారు. సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం 20శాతం, సెస్సు, కస్టమ్స్ డ్యూటీ, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డ్యూటీ అన్నీ కలిపి 27.5శాతానికి పెంచింది. దీంతో ముడిచమురు అమ్మకాలు జోరందుకున్నాయి. ఆ తేడా రైతుల ధరల్లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుత ధర చూస్తే పాత రోజులు పునరావృత్తం అవుతాయా అని రైతులు ఆనంద పడుతున్నారు. ఇందుకు కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రెండేళ్ల ధరలు ఒక్కసారిగా పరిశీలిస్తే..

నెల	2023	2024
జనవరి	13,781	12,681
ఫిబ్రవరి	13,961	13,135
మార్చి	13,943	14,174
ఏప్రిల్	14,205	14,229
మే	13,346	13,438
జూన్	12,623	13,705
జులై	13,091	13,828
ఆగస్టు	13,026	14,392
సెప్టెంబరు	12,231	17,043
అక్టోబరు	12,196	-----
నవంబరు	12,525	-----
డిసెంబరు	12,534	-----

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 లైవ్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, స్కిన్‌లెస్ - 228.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,000	7,011	6,700
పాతపత్తి	4,200	7,550	7,400
పెసలు	4,000	7,375	6,100
కందులు	7,500	8,800	8,800
ఏసీ ఎండుమిరప	11,000	20,000	18,000
ఎండుమిరప	10,000	18,500	17,300
ఏసీ తాలుమిరప	8,700	10,000	9,700

సత్తుపల్లి

• సత్తుపల్లి • మధిర • వైరా

మధిర కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి

మధిర, న్యూస్‌టుడే: మధిరకు మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్వహణకుగాను రిక్రియేషన్ క్లబ్ భవనాన్ని జిల్లా జడ్జి జి.రాజగోపాల్ మంగళవారం పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్‌కు కోర్టు నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కొత్త భవనాలను నిర్మించనున్న నేపథ్యంలో అక్కడి రికార్డులను పక్కనే ఉన్న బార్‌రూమ్‌లోకి తాత్కాలికంగా మార్చాలన్నారు. మధిర న్యాయమూర్తి డి.కార్తీక్‌రెడ్డి, సీఐ మధు, పట్టణ, గ్రామీణ ఎస్సైలు సంధ్య, లక్ష్మీభార్గవి, బార్ సభ్యులు పాల్గొన్నారు.



రిక్రియేషన్ క్లబ్ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జి.రాజగోపాల్

కళాశాల తనిఖీ

చింతకాని, న్యూస్‌టుడే: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి రవిబాబు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అధ్యాపకులతో సమావేశమై సూచనలు చేశారు. విద్యార్థులకు ఎంసెట్ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని పరిశీలించారు. ప్రిన్సిపల్ నవీన్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ విజయ కృష్ణార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పిల్లలకు టీకాలు వేయాలి'



మాట్లాడుతున్న జిల్లా టీకాల ప్రోగ్రాం అధికారి చందునాయక్

ముదిగొండ, న్యూస్‌టుడే: 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించాలని జిల్లా టీకాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ చందునాయక్ సూచించారు. మేడిగొండ పీహెచ్‌సీని మంగళవారం పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చిన్న పిల్లలందరికీ టీకాలు వేయాలన్నారు. వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి, సీహెచ్‌ఓ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వేమన పద్యాలు చదవండి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో సెల్‌ఫోన్లు చూస్తూ కాలం వృథా చేయకుండా విద్యార్థులు వేమన పద్యాలు చదువుకోవాలని లైట్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గంధ్ర శిరోమణి రెడ్డి, శ్రీదేవి దంపతులు సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో వెయ్యి శతక పుస్తకాలను మంగళవారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పంపిణీ చేశారు. స్థానిక ట్రస్టు నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు



కొదుమూరులో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

చింతకాని, న్యూస్‌టుడే: కొదుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఖమ్మం ఏడీబీఐ బ్యాంకు రూ.2.5 లక్షల విలువైన కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం సమకూర్చింది. ఐడీబీఐ ఖమ్మం బ్రాంచ్ 15వ వార్షికోత్సవం సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో ఆరు కంప్యూటర్లతో ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించారు. పేద పిల్లల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఐడీబీఐ అధికారులను అభినందించారు. ఎంఈఓ వీరస్వామి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఐడీబీఐ రీజనల్ హెడ్ దివకల్లి వెంకటేశ్, బ్యాంకు ఏజీఎం రవికాంత్‌శెట్టి, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

మిల్లుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వైరా, న్యూస్‌టుడే: సీఎంఆర్ ధాన్యంలో అవకతవకలకు పాల్పడిన మిల్లుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం సిరిపురంలో మాట్లాడారు. సీఎంఆర్ ధాన్యంలో అవకతవకలకు పాల్పడిన మిల్లు యజమానుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చంద్రరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ.. కల్పన

సత్తుపల్లి, న్యూస్‌టుడే



కుట్టు కొలతలపై శిక్షణ పొందుతున్న మహిళలు

సత్తుపల్లి పరిధిలోని జేవీఆర్ ఓసీ ప్రభావిత ప్రాంత మహిళలకు 'సింగరేణి సేవా సమితి' అండగా నిలుస్తోంది. ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ఇక్కడి ఓసీ ప్రభావిత ప్రాంతాల్లోని గృహిణులు, యువతులకు అనేక రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. కుట్టు మిషన్లు, మగ్గం, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ వంటివాటిలో ఎంపికున్న రంగాలపై మూడు నుంచి ఆరు నెలలపాటు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నారు.

సత్తుపల్లికి చెందిన మహిళలకు నెల రోజుల క్రితం శిబిరం ప్రారంభించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఖాళీగా ఉన్న ఐజేఎస్ భవనంలో శిబిరం ఏర్పాటుచేశారు. శిక్షకులు సిద్దిని నందిని, కలకత్తాకు చెందిన మగ్గం శిక్షకుడు మిథుల్... 20 మందికి మగ్గం, ఎంబ్రాయిడరీ శిక్షణ ఇస్తున్నారు. మరో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అవసరమైన అన్ని సదుపాయాలు, మెటీరియల్సును సంస్థ సమకూర్చింది. గతేడాది యాతాలకుంట, కొమ్మేపల్లి, కిష్టారం, ఎన్టీఆర్‌నగర్ వంటి ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి ఎందరో మహిళలకు ఉపాధినిచ్చారు. ఇక్కడే మిషన్ కుట్టుతూ కుటుంబ ఖర్చులకు సరిపడా సంపాదించుకుంటున్నారు. సింగరేణి సేవా సమితి ఇచ్చే సర్టిఫికెట్లతో బ్యాంకు రాయితీపై రుణాలను సైతం పొందే అవకాశం ఉంది.



సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నెల రోజుల నుంచి కుట్టుమిషన్‌పై శిక్షణ తీసుకుంటున్నా. ఇంట్లో ఖాళీగా ఉండకుండా టైలరింగ్‌పై శిక్షణ తీసుకుని చీరలు, జాకెట్లు, డ్రస్సులను కుడుతూ ఆదాయం పొందాలన్నదే నా ఆలోచన.

- మణికంఠి శైలజ, సత్తుపల్లి



శిక్షణతోపాటు కుట్టు మిషన్లు కూడా ఇస్తే మేలు జరుగుతుంది. కుట్టుమిషన్, మగ్గం పనుల్లో చక్కని శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయంలో చాలా మంది మహిళలను స్ఫూర్తిగా తీసుకున్నా.

- కల్వకొలను విజయలక్ష్మి, సత్తుపల్లి



'టైలరింగ్ వృత్తికి డిమాండ్ ఉంది. చాలామంది మహిళలు, యువతులు ఇంట్లో టైలరింగ్ చేస్తూ సంపాదించుకుంటున్నారు. శిక్షణ పొందిన వారు ప్రత్యేక దుకాణాలను ఏర్పాటు చేసుకుని అభిరుచులకు తగ్గట్లు వస్త్రాలు కుట్టగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుంది.

- సిద్దిని నందిని, కుట్టుమిషన్ శిక్షకురాలు, సత్తుపల్లి

ప్రజలకు అందుబాటులో ఉండాలి: రాగమయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం పెనుబల్లి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సర్వే ప్రయోజనాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి తక్షణం అందించాలని, నర్సరీల్లో మొక్కలను పెంచడంతోపాటు వాటిని గ్రామాల్లో సంరక్షించాలని వివరించారు. కల్లూరు ఏఎంసీ ఛైర్మన్ భాగం నీరజ చౌదరి, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

★ లారీ యూనియన్ ఎన్నికల్లో గెలిచిన సంఘ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు, కార్యవర్గ బృందం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. షేక్ ఖలీల్, కొండపల్లి రమేశ్‌రెడ్డి, పాలకుర్తి దాసు, షేక్ మౌలాలీ పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాల సందర్శన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. ఐటీఏ సదరు కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడంతో కళాశాలలో ఉన్న మౌలిక వసతులను స్వయంగా పరిశీలించారు. బృంద సభ్యులైన కాకతీయ విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్రం, రసాయనశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ రాజేంద్ర, హనుమంతు పలు విభాగాల రికార్డులు, ఆట స్థలాన్ని పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో విద్యాలయ పురోగతి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ ఎన్.గోపి పాల్గొన్నారు.



ప్రిన్సిపల్, అధ్యాపక బృందంతో మాట్లాడుతున్న ప్రతినిధులు

దస్త్రాల నిర్వహణ పక్కాగా ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేశ్

కొణిజర్ల, న్యూస్‌టుడే: ధరణి రిజిస్ట్రేషన్, ఇతర రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆర్డీఓ గణేశ్ తెలిపారు. కొణిజర్ల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్లు, ఇతర రికార్డులను మంగళవారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ సమయంలో వృద్ధులు వస్తే వారికి పూర్తి వివరాలు తెలిపిన తర్వాతనే ప్రక్రియ పూర్తి చేయాలని సూచనలు చేశారు. కుటుంబ సభ్యులు, ఇతర వ్యక్తులు వారికి తెలియకుండా రిజిస్ట్రేషన్లు చేస్తున్న సందర్భాలు ఉంటున్నాయని అందుకే వారికి పూర్తి వివరాలు తెలిపి ఆ తరువాతే రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. అనంతరం అంజనాపురంలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐ అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే యత్నం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం

బోనకల్లు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కేంద్ర, రాష్ట్ర పాలకులు వివాదాలను సృష్టిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వర్లు అన్నారు. ఆళ్లపాడులో మంగళవారం పార్టీ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చే పరిస్థితి లేక హైడ్రా సృష్టించారన్నారు. కేంద్రంలో భాజపా పాలకులు జమిలి ఎన్నికలు, ఏపీలో తిరుపతి లడ్డూ సమస్య తెరపైకి తెచ్చారని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరరావు, నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ మహాసభలు జయప్రదం చేయండి

వైరా, న్యూస్‌టుడే: నిరంతరం యువత సమస్యలపై పోరాడే యువజన ఉద్యమాల సారథి డీవైఎఫ్ఐ మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ కోరారు. మంగళవారం వైరా పట్టణ కార్యదర్శి షేక్ నాగుల్ పాషా అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడారు.

నవరాత్రులకు ఏర్పాట్లు

ఏన్కూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలకు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏన్కూరులోని కోదండ రామాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం కూడలి, చెరువుబజార్‌లో మండపాలు సిద్ధం చేశారు. రేపల్లెవాడ, తిమ్మారావుపేట, టీఎల్‌పేటతోపాటు పలుచోట్ల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

లచ్చన్నగూడెం సొసైటీకి రూ. 20.35 లక్షల లాభం

వేంసూరు, న్యూస్‌టుడే: లచ్చన్నగూడెం సొసైటీ 2023-24లో రూ.20.35 లక్షల లాభం సమకూరినట్టు సొసైటీ ఛైర్మన్ గంధ్ర సోమిరెడ్డి తెలిపారు. సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాజనసభలో మాట్లాడుతూ సొసైటీలో ఈ ఏడాది రూ.8.5 కోట్లు రుణం మంజూరు చేశామన్నారు. మద్దిపాడు సహకార బ్యాంకు మేనేజర్ రజిత మాట్లాడారు. సొసైటీ మాజీ ఛైర్మన్లు దూబా శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డిలను ఛైర్మన్ సోమిరెడ్డి, పాలకవర్గ సభ్యులు సన్మానించారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి

కొణిజర్ల, న్యూస్‌టుడే: లాలాపురంలోని ఓ పరిశ్రమ వద్ద వేతనాలు ఇవ్వాలని కార్మికులు చేస్తున్న ఆందోళనకు సీఐటీయూ నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. సీఐటీయూ నాయకులు అనుమోలు రామారావు, సుంకర సుధాకర్ మాట్లాడారు.. యాజమాన్యం వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ సీనియర్ నాయకుడు మృతి

బోనకల్లు, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నాయకుడు బుంగా నాగభూషణం(85) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం చనిపోయారు. సతీమణి వెంకటనర్సమ్మ ఆళ్లపాడు సర్పంచిగా పనిచేశారు. వీరికి ఓ కుమార్తె ఉన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు, జిల్లా కమిటీ సభ్యుడు తూము రోషన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు తోటకూర వెంకటేశ్వర్లు, పారా మోహన్‌రావు, పెరుమాళ్లపాడు సంతాపం తెలిపారు.

శతాధిక వృద్ధురాలు...

కారేపల్లి, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లిలో శతాధిక వృద్ధురాలు వడ్డే శాంతమ్మ(101) మంగళవారం మృతి చెందారు. ఆమెకు ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. శాంతమ్మ కుమారుడు, మాస్‌లైన్ నేత వెంకటేశ్వర్లును పరామర్శించారు.

కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పుర పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, నీటి సరఫరా కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులందించారు. కమిషనర్ ఎం.రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఇంజినీర్ సమీర్, సిబ్బంది పాల్గొన్నారు.


వైరా, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాన్ని కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమిషనర్ చింత వేణు పాల్గొన్నారు.

ఏన్కూరు వాసికి డాక్టరేట్

ఏన్కూరు, న్యూస్‌టుడే: కల్లుమల్లెకు చెందిన గుగులోతు వాసుదేవ్‌కు హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. తెలుగు సాహిత్య విభాగంలో ఆచార్య బాణోతు కుటుంబరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ఎంపికయ్యారు.

కొణిజర్ల, న్యూస్‌టుడే: పల్లిపాడుకు చెందిన నల్లబోలు రాజీవ్‌రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఎడ్యుకేషన్ అండ్ సోషల్ ఇంక్లూజన్, ఏ స్టడీ ఆన్ డిజాన్ సెక్షనల్ అనాలిసిస్ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ తీసుకున్నారు.

పొలాల పరిశీలన



వైరా, న్యూస్‌టుడే: రైతునేస్తంలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతువేదికలో రైతులకు వేయాలనన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయాధికారి మయూరి మంజుఖాన్, ఏఈఓ మోహన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కల్లూరు, న్యూస్‌టుడే: ఎర్రబోయినపల్లికి చెందిన తాళ్ల పుల్లయ్య, శేషమ్మల దశదినకర్మలకు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బీరవల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బీరవల్లి రఘు రూ.10వేలు సాయం అందజేశారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి..

వైరా, న్యూస్‌టుడే: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పల్లిపాడు గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని పానెం శ్రీహరిణికి రూ.10 వేల నగదు, మెడిసిన్ పుస్తకాలను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాపా మురళీకృష్ణ మంగళవారం అందజేశారు.

అదృశ్యమైన వ్యక్తి .. విగతజీవిగా



కృష్ణారెడ్డి

పెనుబల్లి, న్యూస్‌టుడే: ముత్తగూడెనికి చెందిన శీలం కృష్ణారెడ్డి(38) గత నెల 30న పురుగుమందు తాగి టేకుల పల్లి-కుప్పెనకుంట్ల రహదారిలో ఇబుకబల్లిక వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఘటన స్థలంలో కృష్ణారెడ్డి ఆచూకీ కోసం యత్నించినా లాభం లేకపోయింది. ఈ నేపథ్యంలో బట్టల మధ్యన విగత జీవిగా కన్పడ్డాడు. పోలీసులు శవ పరీక్ష నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని బంధువులు తెలిపారు. కృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెనుబల్లి, న్యూస్‌టుడే: వీఎం బంజరులో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు కోణాల గోపాలకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం.. 15 ఏళ్లుగా స్థానికంగా ఉంటున్న కుటుంబం తో సహా సోమవారం ఉదయం సొంత ఊరు రాజమండ్రి వెళ్లారు. మంగళవారం సాయంత్రం వచ్చి చూసేసరికి ఇంటి తలుపుల పగులగొట్టి ఉన్నాయి. లోపల బీరువాలాకర్లను పగులగొట్టి రూ. 1.25 లక్షల నగదు, రూ.6లక్షల బంగారు నెక్లెస్, ఇతర ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. సీఐ మల్లికార్జున్ ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత

ముదిగొండ, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి గ్రామానికి చెందిన ఆడపా అరుణ్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ముదిగొండ పోలీసుస్టేషన్ ప్రాంతంలో అయిదు కిలోల ఎండు గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు తెలిపారు. ఏపీలోని చల్లి నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. ఎస్సై లత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుట్కాలను విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లికి చెందిన దోసపాటి మురళీకృష్ణ గుట్కాలు తీసుకొస్తుండగా అన్నపురెడ్డిపల్లిలో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు.

ఏటీఎం కేంద్రంలో మోసం



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

వైరా, న్యూస్‌టుడే: ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లిన ఓ మహిళ మోసపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముసలిమడుగు గ్రామానికి చెందిన తడికమళ్ల రాధ గత నెల 27న ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్లింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి ఆమెకు సాయం చేస్తున్నట్లు నటించి కార్డు మార్చాడు. రూ.వెయ్యి నగదు డ్రా చేసుకున్న అనంతరం కార్డు మార్చిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సదరు మహిళ గత నెల 30న మరోసారి ఏటీఎంకి వచ్చినప్పుడు తన కార్డు మారిందని తెలుసుకొని బ్యాంకులో నగదు నిల్వ చూస్తే డ్రా చేసినట్లు ఉంది. గత నెల 27న జరిగిన లావాదేవీ సమయంలో మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

చింతకాని, న్యూస్‌టుడే: పందిళ్లపల్లి గ్రామ సమీపంలోని రెండు వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో రాగితీగను అపహరించినట్లు ఏఈ ఉమామహేశ్వరి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

గొర్రెలగుంపుపై కుక్కల దాడి

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లికి చెందిన జంగా మధు ఇంటికి కొద్దిదూరంలో ఉన్న ఖాళీ స్థలంలో గొర్రెలను ఉంచారు. సోమవారం అర్ధరాత్రి గొర్రెలగుంపుపై గ్రామ కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. వీటిలో 13 గొర్రెలు మృతిచెందగా, సుమారు 18 వరకు తీవ్రంగా గాయపడ్డాయి. మంగళవారం బాధితుడు బోరున విలపించాడు. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. బారాస మైనార్టీ సెల్ నాయకుడు షేక్.గౌసుద్దీన్ మధుకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

అడసర్లపాడులో అగ్ని ప్రమాదం

వేంసూరు, న్యూస్‌టుడే: అడసర్లపాడులో వేల్పుల నాగేశ్వరరావుకు చెందిన వంట ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. సామగ్రి కాలిపోయింది. ప్రజలు మంటలు చెలరేగి ఇంట్లోని సామాగ్రి కాలిపోయాయి. రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

నేడు ఆన్‌లైన్‌లో పాఠశాల ప్రారంభం

కారేపల్లి, న్యూస్‌టుడే: రేలకాయలపల్లిలో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి మోదీ ఆన్‌లైన్ ప్రక్రియలో పాఠశాలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే అన్ని రకాల పనులు పూర్తి చేశారు.



ఏకలవ్య పాఠశాల

పీఆర్టీయూ భవన నిర్మాణానికి రూ.లక్ష వితరణ

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బూసా కోటేశ్వరరావు పీఆర్టీయూ మధిర మండల శాఖ భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. జిల్లా మండల సర్వసభ్య సమావేశంలో ప్రకటించిన మొత్తాన్ని బాధ్యులకందజేశారు.

పొట్ట కొట్టకండి..

తల్లాడ, న్యూస్‌టుడే

సాగునీటి విడుదలను పెంచాలని రైతుల వేడుకోలు



సాగునీరు లేక ఎండిపోయిన వరిపొలం

ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు పెట్టుబడి అన్నదాతలు ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి పొలాలకు సాగునీరు అందక కళ్లముందే ఎండిపోతున్నాయి. పొట్ట, ఈనే దశలో ఉన్న వరి పంట నెర్రలుబారి వడలిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.


తల్లాడ మండలం నూతనకల్ గ్రామానికి పుణ్యపురం మేజర్ కాలువ నుంచి మిట్టపల్లి మైనర్-1 కాలువ ద్వారా సాగు నీరు సరఫరా అవుతోంది. మిట్టపల్లి మైనర్ కాలువ సుమారు 7కిలోమీటర్లు పొడవు ఉంటుంది. పుణ్యపురం మేజర్ నుంచి మూడో కిలోమీటరు వద్ద నూతనకల్ గ్రామ రైతుల పొలాలకు సరిపడా నీరు సరఫరా కావడం లేదు. దీంతో సుమారు 150ఎకరాలు ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. మిట్టపల్లి మైనర్ కాలువ పరిధిలో సుమారు 3 కి.మీ. మేర పిచ్చిమొక్కలు, కంపచెట్లు, పూడికతీత పనులు రైతులే పూర్తి చేశారు. రూ.30వేలతో కాలువకు మరమ్మతులు చేపట్టారు.

'నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం వరిపంట పొట్ట, ఈనే దశలో ఉంది. ఎన్నెస్పీ జలాలు సక్రమంగా రాక పొలం నెర్రలుబారింది.'



- శెట్టిపల్లి లక్ష్మణరావు, కౌలురైతు

'రెండు ఎకరాలకు రూ.60వేలు పెట్టుబడి పెట్టాను. అధికారులు త్వరితగతిన స్పందించి నీటి విడుదలను పెంచి పొలాలను రక్షించాలి.'



- చేదె వెంకటేశ్వర్‌రావు, రైతు

'పాలేరు సమీపంలో యూటీ దెబ్బతినటంతో కాలువకు సరిపడా సాగునీరు విడుదల చేయలేదు. 5వేల క్యూసెక్కులకు గాను ప్రస్తుతం 3610 క్యూసెక్కులు వస్తున్నాయి. రెండు రోజుల్లో సరఫరా పెంచే అవకాశం ఉంది.'

- వి.శ్రీనివాసరావు, జలవనరుల శాఖ డీఈ

ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

శాంతిభద్రతలకు ప్రాధాన్యం: అదనపు డీసీపీ

కూసుమంచి, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. కూసుమంచి పోలీసు ఠాణాను మంగళవారం సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. నేర నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. అదనపు డీసీపీ మాట్లాడుతూ.. అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలన్నారు. స్టేషన్లలో స్టేషనరీ విభాగం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీసీ కెమేరాలను స్థానికులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని వివరించారు.


పోలీసు ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు డీసీపీ ప్రసాద్‌రావు

నెలకు సరిపడా ఔషధ నిల్వలు ఉంచండి: కిరణ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రిలో ఔషధాల కొరత లేకుండా నెలకు సరిపడా నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ఫార్మసీ విభాగం పర్యవేక్షకులను ఆదేశించారు. రోగులకు అత్యవసరం కలిగిన సమయంలో 'ఈనాడు'లో 'రోగం తగ్గాలంటే సొమ్ములు ఉండాల్సిందే' శీర్షికన మంగళవారం ఔషధాల కొరతపై కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ ఆస్పత్రిలోని ఫార్మసీ విభాగం అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రస్తుత స్టాకు, మందుల కొరత వివరాలను సేకరించారు. టీజీఎంఎస్ఐడీసీ అధికారులు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బందితో మాట్లాడారు. నెలకు సరిపడా నిల్వలు ఉండేలా ఔషధాలను సరఫరా చేయాలని కోరారు. అలాగే 15 రోజుల ముందుగానే ఇండెంట్ పెట్టి మందులను స్టాక్ చేయాలని ఫార్మసీ సిబ్బందికి స్పష్టం చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్పీపై సమగ్ర విచారణకు కమిషనర్ ఆదేశం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రూ.కోటి స్వాహాకు యత్నించిన రిసోర్స్‌పర్సన్(ఆర్పీ) వ్యవహారం సమగ్ర నివేదిక అందించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. 'రూ.కోటి స్వాహాకు వ్యూహం' పేరిట మంగళవారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఆర్పీల పనితీరుపై, ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే వెంటనే విచారణ చేపట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. రుణాల విషయంలో ఎటువంటి వసూళ్లకు పాల్పడవద్దని, పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవాలని మెప్మా సిబ్బందికి సూచించినట్లు తెలుస్తోంది.

సాంకేతిక లోపం.. తీరని జాప్యం

సాంకేతిక లోపాలతో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నిర్వహించలేదు. దీంతో ఉదయమే కేంద్రం వద్దకు చేరుకున్న అభ్యర్థులు సాయంత్రం వరకు ఎదురు చూడాల్సి వచ్చింది. రిక్కాబజారు ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేశారు. సిబ్బంది, వంద మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులు ఉదయమే తరలి వచ్చారు. సాయంత్రం వరకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి జాబితా రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

జాబితా ప్రకటించలేదు
– ఎం.రవికిరణ్, చిమ్మపుడి, రఘునాథపాలెం మండలం



స్కూల్ అసిస్టెంట్ గణితంలో అర్హత సాధించా. నాకు డీఈఓ కార్యాలయం నుంచి గానీ.. రాష్ట్ర విద్యాశాఖ నుంచి గానీ ఎలాంటి సమాచారం రాలేదు. ధ్రువపత్రాల పరిశీలన ఉందని తెలిసి ఇక్కడికి వచ్చా. ఇక్కడ మాత్రం జాబితా ప్రకటించలేదు. దీంతో అయోమయ పరిస్థితి నెలకొంది. పరిశీలన కేంద్రం వద్ద ఎలాంటి సమాచారం అందుబాటులో లేకపోవటంతో వెనుదిరిగి వెళ్తున్నా.

డీఈఓ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు
– డి.భానుశరణ్య, ఖమ్మం



డీఈఓ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. వివరాలు తెలియడం లేదు. దీంతో పరిశీలన కేంద్రం వద్దకు వచ్చి వివరాలు తెలుసుకున్నా. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు ఎంపికయ్యా. మెరిట్ జాబితాలో పేరుంటే ధ్రువపత్రాలు తెచ్చుకోవాలనుకున్నా. 637వ ర్యాంకు వచ్చింది. అర్హత సాధించాను. 1:3 జాబితాలో పేరుంటుందని భావిస్తున్నాను. ఇక్కడ ఎలాంటి సమాచారం లేదు.

అన్ని ధ్రువపత్రాలతో వచ్చా...
– కోట నాగేశ్వరరావు, రఘునాథపాలెం



స్కూల్ అసిస్టెంట్ తెలుగులో అర్హత సాధించా. 469వ ర్యాంకు. ఎస్టీ కేటగిరీ. జాబితాలో పేరుంటుందని భావించి అన్ని ధ్రువపత్రాలతో కేంద్రానికి హాజరయ్యా. ఇదే నాకు చివరి డీఎస్సీ. ఉద్యోగం వస్తుందని ఆశ ఉంది. కానీ ఇక్కడకు వచ్చిన తర్వాత ధ్రువపత్రాల పరిశీలన జరగకపోవటం నిరాశ కలిగించింది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిర్ణయించిన సమయానికి పరిశీలన ప్రారంభిస్తే బాగుండేది.

వివరాలు తెలుసుకుందామని...
– బొడ్డు నవీన్‌కుమార్, వెంకటగిరి



స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 74వ ర్యాంకు వచ్చింది. అర్హత సాధించినప్పటికీ ఎలాంటి సమాచారం రాకపోవటంతో ఇక్కడకు వచ్చాను. స్టేట్ వెబ్‌సైట్‌లో సైతం సమాచారం అందుబాటులో లేదు. ఏయే సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని, 1:3 జాబితా తదితర వివరాలు పరిశీలన కేంద్రం వద్ద బోర్డు పెడితే అందరికీ సమాచారం తెలిసేది.

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమ కళాశాలలో ఇంటర్ ఎంపీజీ విద్యార్థిని అమూల్య రోలర్ స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.అరుణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినికి తాను రూ.1,000 ప్రోత్సాహకం అందజేసినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

జల్లేపల్లి పశువైద్యశాలలో సిబ్బంది ఉండటం లేదు. పశువులను తీసుకొచ్చినా ప్రయోజనం లేదు. - **స్థానికులు**

✔ జల్లేపల్లి పశువైద్యశాలను పరిశీలించి, సమస్య పరిష్కరించేలా చూస్తాను. **ఎంపీడీఓ, సిలార్ సాహెబ్**

– తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే

ముస్తఫానగర్ ఎంఎంఆర్ ఎన్‌క్లేవ్ వద్ద మంచినీటి పైపులైన్ లీకవుతోంది: **ఓ పాఠకుడు**

✔ మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం: **కృష్ణలాల్, ఈఈ**

సమస్య: అగ్రహారం ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో చెత్తకుప్పలు అధికంగా ఉన్నాయి. శుభ్రం చేయడం లేదు. **స్థానికుడు**

సమాధానం: రెండు రోజుల్లో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం: **సంపత్ కుమార్, సహాయ కమిషనర్**

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వంతెన పైనుంచి దూకిన యువకుడు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: వ్యక్తిగత కారణాలతో మున్నేరు వంతెనపై నుంచి దూకిన వ్యక్తిని ట్రాఫిక్ పోలీసులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన ఘటన ఖమ్మంలో మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం గ్రామీణ మండలం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో నివాసం ఉండే పారుపల్లి ఉమేశ్(22) వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు కరుణగిరి సమీపంలోని మున్నేరు వంతెనపై నుంచి కిందకు దూకాడు. నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో పడటంతో కాలుకు గాయం అయింది. గాయంతోనే ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. స్థానికులు గుర్తించి మున్నేరు వంతెన వద్ద ట్రాఫిక్ విధుల్లో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అతన్ని బయటకు తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించారు. అతను హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముమ్మరంగా మరమ్మతులు



మరమ్మతుల కారణంగా ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ హైలెవల్ వంతెన స్పాన్ పది అంచుల మేర పక్కకు జరిగిన విషయం విదితమే. మరమ్మతులు చేపట్టేందుకు తాత్కాలికంగా ఈ వంతెనను మూసేశారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులను మాత్రమే అనుమతిస్తున్నారు. లోలెవల్ వంతెనపై గుంతలను బండరాళ్లతో పూడ్చుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక హైలెవల్ వంతెన మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ డీఈ చంద్రశేఖర్ 'ఈనాడు'కు తెలిపారు. – ఈనాడు, ఖమ్మం

పచ్చదనానికి పునరుజ్జీవం



ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్ వంతెన నుంచి ప్రకాశ్‌నగర్ రహదారి వరకు డివైడర్ల మధ్య నాటేందుకు 12 మంది కూలీలు కడియం నర్సరీ నుంచి 1,200 మొక్కలను తీసుకొచ్చారు. ఇటీవల మున్నేరు వరద ఉద్ధృతికి నీట మునిగి ఎండిన చెట్లను తొలగించి వాటి స్థానంలో మొక్కలు నాటారు.
– ఈనాడు, ఖమ్మం

ముక్కల కోసం కుక్కల తగాదా!



నగరంలో కుక్కల బెడద పెరిగింది. కొన్ని ప్రాంతాల్లోనే వీటి సంచారం ఎక్కువగా ఉంది. ఇందుకు కారణం లేకపోలేదు. కోడి కాళ్లు, మటన్ వ్యర్థాలు, ఎముకలు అన్నంలో కలిపి చిన్నపాటి బిర్యానీ తయారు చేసి కుక్కలకు ఆహారం పెడుతున్నవారున్నారు. వారు ఆహారం పెట్టే ప్రాంతాలు, ప్రదేశాల్లో వీటి సంచారం పెరిగింది. ఆ సమయంలో ఎవరు సంచి పట్టుకొని వచ్చినా ఆహారం తెస్తున్నారని వారి చుట్టూ తిరుగుతున్నాయి. 27వ డివిజన్‌లోని ప్రాంతంలో ఓ దాత ఆహారాన్ని కాలువ పక్కన పెట్టారు అది కాస్తా కాలువలోకి జారింది. అందులోని ముక్కలు, బొక్కల కోసం కుక్కల సమూహం కుస్తీ పట్టిన దృశ్యమిది. – **ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే**

రేపటి నుంచి కుటుంబ గుర్తింపు సర్వే

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం, నియోజకవర్గంలో ఒక గ్రామం, ఒక పట్టణంలో ఒక వార్డును ఎంపిక చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఖమ్మం నగరంలో **54వ డివిజన్** ఎంపిక చేయడంతో గురువారం నుంచి అధికారులు డివిజన్‌లో సర్వే చేయనున్నారు. ఇంటింటికి వెళ్లి వారి జీవన స్థితిగతులు, ఇతర వివరాలు సేకరించడంతో పాటు కుటుంబ సభ్యుల ఫొటో తీసుకుంటారు. సర్వేకు వచ్చే అధికారులకు ఆ డివిజన్ ప్రజలు సహకరించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య కోరారు.

ఆరోగ్య పథకాలు సద్వినియోగం చేసుకోండి

కామేపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు అన్నారు. కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎంసీహెచ్, ఏఎన్‌సీ కార్యక్రమాల అమలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యురాలు చందన, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం అక్రమాలపై విచారణకు ఆదేశం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కస్టమ్స్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ధాన్యం అక్రమాలపై విచారణ జరపాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను వేర్వేరుగా ఆదేశించారు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎవరినీ సహించేది లేదని హెచ్చరించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించకుండా ఎగవేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్‌కు సూచించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామానికి చెందిన వీరనాగులు తన బైక్‌పై మద్దులపల్లి వస్తుండగా పొన్నెకల్లు వద్ద మంగళవారం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతణ్ని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆదర్శంగా ఉండాలి: బండి రమేశ్

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ఆదర్శప్రాయంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేశ్ అన్నారు. మల్లేపల్లిలో పార్టీ మహాసభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుగ్గవీటి సరళ, పొట్టపింజర ప్రసాద్, రమణారెడ్డి, రాజు, గురుమూర్తి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపులో భాగంగా బుధవారం నగరంలోని అన్ని డివిజన్లలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ ప్రజలు ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి: భాజపా

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును కార్యకర్తలు, శ్రేణులు వేగవంతం చేయాలని పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి ఎడ్ల అశోక్‌రెడ్డి సూచించారు. మండలంలో సభ్యత్వ నమోదును మంగళవారం పరిశీలించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటిని తరలించేందుకు చర్యలు: కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో ఉన్న నీటిని తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. మంగళవారం నగరంలోని పాండురంగాపురం, యుపీహెచ్‌కాలనీ, అమరావతినగర్, విద్యానగర్‌లను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండడాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సహాయ కమిషనర్ సంపత్ కుమార్‌కు సూచించారు. కార్పొరేటర్ జ్యోతిరెడ్డి పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు.


అమరావతినగర్‌లో పర్యటించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య, చిత్రంలో సంపత్‌కుమార్, జ్యోతిరెడ్డి

డెంగీ కేసులు లేవు: గత నెల 23 నుంచి ఇప్పటి వరకు నగరపాలక సంస్థ పరిధిలో ఒక్క డెంగీ కేసూ నమోదు కాలేదని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. డెంగీ నివారణకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. గాంధీజయంతి సందర్భంగా బుధవారం ఖమ్మం నగరంలోని మద్యం, మాంసం దుకాణాలు బంద్ చేయాలని కమిషనర్ తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ధ్రువపత్రాలకు దరఖాస్తులు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల వరదల్లో పదో తరగతి చదివి తమ సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు వారికి తిరిగి సర్టిఫికెట్లు అందజేసే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సర్టిఫికెట్లు అందజేసేందుకు తగిన సమాచారం అవసరం ఉంది. ఇందుకు మంగళవారం ఖమ్మం నగరంలోని జూబ్లీపుర లోని పాత డీఈఓ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తమ పదో తరగతికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉన్నట్లయితే తీసుకోని హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో కోరారు. ఇందుకు సంబంధించిన వారు రాష్ట్ర కార్యాలయానికి ఒక దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుపై సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. సర్టిఫికెట్లు కోల్పోయిన వారు 3న పాత డీఈఓ కార్యాలయానికి వస్తే వారికి సంబంధించిన ధ్రువపత్రాలు తిరిగి తెప్పిస్తామని పేర్కొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న రామకృష్ణ

'ప్రభుత్వ భూముల్ని ఆక్రమిస్తే చర్యలు'

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దారు వెంకటరామకృష్ణ హెచ్చరించారు. తిరుమలాయపాలెంలోని సర్వే నం. 254లో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఇది అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు సిబ్బంది సహకారంతో తహసీల్దారు మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాదయాత్ర

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులు మంగళవారం పాదయాత్ర చేపట్టారు. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాయిగూడెం పాఠశాల వరకూ పాదయాత్ర చేశారు. సుమారు 20 కి.మీ. పైగా కాలినడకన ప్రయాణిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, ఉపాధ్యాయుల పనితీరు స్థానికులకు వివరిస్తూ ముందుకు సాగారు. రాయిగూడెంలో వీరికి సహచర ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పాదయాత్ర చేపట్టిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజు, నాగేశ్వరరావులను ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పురుషోత్తమరావు, నాగార్జున అభినందించారు.


పాదయాత్ర చేస్తున్న ఉపాధ్యాయులతో సహచరులు

మంత్రులు, ఎంపీని కలిసిన గ్రానైట్ సంఘం ప్రతినిధులు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్, ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పాటిబండ్ల యుగంధర్, కమిటీ ప్రతినిధులు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరిని హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. వారి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ఉన్నారు. 20న నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.


మంత్రి తుమ్మలతో గ్రానైట్ యజమానుల సంఘం అధ్యక్షుడు యుగంధర్ తదితరులు

టీకాలు తప్పనిసరిగా అందించాలి: డీఐవో

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఆరోగ్య ఉపకేంద్రాల్లో చిన్నపిల్లలు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.చందునాయక్ సూచించారు. నేలకొండపల్లి పీహెచ్‌సీని మంగళవారం సందర్శించి టీకాల గది, చిన్నారులకు సంబంధించిన సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆశాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డా.శ్రవణ్ కుమార్, డా.నాగమణి, డా.సన, సీహెచ్‌వో శాంతిరాణి, హెచ్‌ఈవో వీరన్న తదితరులు పాల్గొన్నారు.


టీకా గదిని పరిశీలిస్తున్న చందునాయక్

కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఊళ్లకు బయలుదేరే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. ఖమ్మం పాత బస్టాండ్‌లో మంగళవారం నుంచే రద్దీ నెలకొంది. మహిళలు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులతో బస్టాండ్ కిటకిటలాడింది. బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు 20 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



